# Andhra Jyothi

## గ్రూప్-2 ఇంటర్వ్యూలకు సింగిల్ బోర్డు

- **కొత్తగా 317 మంది అభ్యర్థులకు అర్హత**
- **రెండు, మూడు రోజుల్లో వెబ్‌సైట్లో జాబితా**
- **రూల్-7 ప్రకారమే తుది ఎంపికలు: ఏపీపీఎస్సీ**

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 1999 నాటి గ్రూప్-2 నోటిఫికేషన్‌కు సంబంధించి కొత్తగా మరో 317 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కసరత్తు చేస్తోంది. సింగిల్ బోర్డు ద్వారా వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. వేర్వేరు బోర్డుల ద్వారా వీటిని నిర్వహించడం వల్ల మార్కుల కేటాయింపులో పలు అనుమానాలు రావొచ్చన్న అభిప్రాయంతో మంగళవారం కమిషన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. రోజుకు 30 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసేలా కార్యాచరణకు కమిషన్ సిద్ధమవుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. అర్హత లభించిన అభ్యర్థుల జాబితాను 2-3 రోజుల్లో వెబ్‌సైట్లో పెట్టనుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 1200 ఎగ్జిక్యూటివ్ భర్తీ చేసేందుకు ఎన్నడూ లేని విధంగా రూల్-7ను అనుసరించనుంది. అంటే అభ్యర్థుల అంగీకారం కోరనున్నారు. ఉద్యోగం అవసరం లేని వారు అంగీకారం తెలుపరు కాబట్టి, తదుపరి స్థానంలో ఉన్న అభ్యర్థులు ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. కొత్తగా అర్హత లభించిన 317 మందికి ఇంటర్వ్యూ నిర్వహించి.. మార్కులు కలిపాక, నియామకాలపై ఏర్పడిన సంక్లిష్టతను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాలని భావిస్తోంది. సుప్రీం తీర్పును అమలు చేస్తే ప్రస్తుత ఉద్యోగుల్లో కొందరి కొలువులు ఊడిపోవడం ఖాయంగా కనిపిస్తున్నందున, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి వారికి భరోసా కల్పించేలా సర్కారుకు సిఫారసు చేయాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. గతంలో అనుసరించిన 70:30 విధానం వల్ల జరిగిన తప్పులను సరిదిద్దాలని భావిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఇప్పుడు సెలెక్షన్స్‌లో 85:15 విధానాన్ని అనుసరించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.